క్లుప్తంగా

నేడు విద్యుత్ కోతలు

కొల్లాపూర్: పట్టణంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల కారణంగా మంగళవారం కరెంట్ కోతలు ఉంటాయని విద్యుత్‌శాఖ ఏఈ రాకేష్‌రెడ్డి వెల్లడించారు. 11 కేవీ టౌన్ బ్రేకర్ రీప్లేస్‌మెంట్ చేయడం కోసం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. కొల్లాపూర్ పట్టణంతో పాటు రామాపురం, సోమశిల, చుక్కాయిపల్లి, ఎల్లూరులో కరెంట్ కోతలు ఉంటాయని తెలిపారు.

ఎస్‌ఐగా బాధ్యతలు

చారకొండ: మండల ఎస్‌ఐగా వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ వీఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై మండలానికి వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్ సెలవులపై వెళ్లారు.

రాష్ట్ర కార్యదర్శిగా గంగాధర్

కల్వకుర్తిరూరల్: అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన గంగాధరాచారి నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం నియామక పత్రం అందించారు.

కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రైతులు సాగు చేసుకున్న పంటలకు కోతల్లేని విద్యుత్‌ను సరఫరా చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ సోమవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సాగు ఆశాజనకంగా ఉండడం వల్ల ప్రభుత్వం కోతల్లేని విద్యుత్ అందజేసి ఆదుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ చట్టవిరుద్ధం

మన్ననూర్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక జేఏసీ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. సోమవారం అమ్రాబాద్ మండలంలో వివిధ గ్రామాలలో పర్యటించిన జేఏసీ కమిటీ సభ్యులు ఎస్సీ వర్గీకరణ చట్ట విరుద్ధమని, రాజ్యాంగాన్ని కించపరచడమే అవుతుందని తెలిపారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు

ఉప్పునుంతల: మండల వ్యవసాయాధికారి కొర్ర రమేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఏఓ సునీత ఇటీవల హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లగా కొల్లాపూర్‌లో ఏఓగా పనిచేసిన కొర్ర రమేష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. 2017 నుంచి 2020 వరకు డిప్యూటేషన్‌పై రమేష్ మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేశారు.

అధికారి బదిలీ

చారకొండ: మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్ కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు. దాదాపుగా 8 ఏళ్లు మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించినట్లు పేర్కొన్నారు. మండలానికి వ్యవసాయ అధికారిగా తనూజరాజ్ బదిలీ అయినట్లు తెలిసింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలోని గోప్లాపూర్ చెందిన కళావతమ్మకు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోపాల్ చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, ప్రభాకర్, ఆంజనేయులు, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు నీరందించాలి

కల్వకుర్తి: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా డీ–82 కాల్వకు సాగునీరు అందించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కేఎల్‌ఐ కాల్వల ద్వారా నీరు అందిస్తున్న అచ్చంపేట ప్రాంతంలోని పలు మండలాల్లో పారుతున్న నీరు వృథాగా పోవడంతోపాటుగా, పంట పొలాలలోకి నీరు రావడంతో పంటలు సైతం దెబ్బతింటున్నాయని తెలిపారు. డీ–82లో భాగంగా కాల్వల నిర్వహణ సరిగా చేయకపోవటంతో నీరు రాక కల్వకుర్తి ప్రాంత రైతాంగం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాల్వలు తెగిపోతుండటంతో నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం ఉదయం మర్రిపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యజమానులు శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.


తాడూరులో అన్నకు రాఖీ కడుతున్న చెల్లి


కల్వకుర్తిలో..


పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరంలో..

ఘనంగా రక్షాబంధన్

సాక్షి, నెట్‌వర్క్: సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రేమానురాగాలతో అక్క చెల్లెళ్లు తమ అన్న దమ్ములకు రాఖీలను కట్టి దీవించారు. వివిధ ప్రాంతాల నుంచి పుట్టింటికి చేరుకున్న సోదరిమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, తీపి వంటకాలతో వారు నోటిని తీపి చేసి వారి ఆశీర్వాదాలు పొందారు. సోదరులు అందజేసిన నూతన వస్త్రాలు, నగదు, బహుమతులు స్వీకరించారు.


అచ్చంపేట బాలసదన్‌లో చిన్నారులకు రాఖీకడుతున్న అంజనీమాత సేవా సమితి సభ్యులు


అచ్చంపేటలో వెంకటేశ్వశర్మకు రాఖీ కడుతున్న షాజాహాన్ బేగం


పెద్దకొత్తపల్లిలో..


నాగర్‌కర్నూల్..


వెల్దండలో..


తెలకపల్లిలో రాఖీలు కొంటున్న మహిళలు


చారకొండలో..

భక్తిశ్రద్ధలతో గాయత్రీధారణ


దోమలపెంటలో గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న పద్మశాలీలు

దోమలపెంట: స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం పద్మశాలీలు భక్తిశ్రద్ధలతో నూలు పూర్ణిమ గాయత్రియజ్ఞ పవిత్రధారణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి గణేష్ పూజ, రుద్రాభిషేకం, గాయత్రిపూజ తదుపరి రక్షబంధనం కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో సోమవారం భక్తమార్కండేయ సేవా సమితి ఆధ్వర్యంలో గాయత్రీ ధారణ కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలీలు నులిపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా గాయత్రీధారణ చేశారు. ఈ సందర్భంగా భక్త మార్కండేయకు పూజా నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలోని దేవాలయాల్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో హోమం, విష్ణు సహస్రనామం, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలను పూజారి జగదీశ్వరాచారి ఆధ్వర్యంలో చేపట్టారు.

వైభవంగా పోచమ్మ బోనాలు


సూరాపూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, భక్తులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో సోమవారం పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని గ్రామంలో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో పోచమ్మకు గ్రామ ప్రజలు బోనాలు సమర్పించుకున్నారు. మొక్కులలో భాగంగా బోనాలతో పాటు, కోళ్లను, పొటేళ్లను బలిచ్చారు.

లింగాల: మండలంలోని సూరాపూర్‌లో సోమవారం పోచమ్మ బోనాలను నిర్వహించారు. శక్తి పూజారి చంద్రకంటి బైండ్ల గిరి వారి బృందం శక్తి పూజల నడుమ ఆదివారం రాత్రి కోటమైసమ్మ పండుగను నిర్వహించారు. ఈ మరుసటి రోజు పోచమ్మ తల్లి వేడుకలను నిర్వహించారు. మహిళలు అలంకరించిన బోనాలను తలపై పెట్టి బైండ్ల వారి డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులో ఉన్న పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం గ్రామ దేవతకు తమకు తోచిన విధంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


చారకొండలో బోనాలతో మహిళలు

వర్షం కోసం గ్రామస్తుల పూజలు



వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లిలో సోమవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలకు నీటితో అభిషేకం చేపట్టారు. సకాలంలో వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం డప్పు వాయిద్యాలతో భజన పాటలతో గ్రామ సమీపంలో ఉన్న బండపైకి వెళ్లి బెల్లంతో ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదంను వరదపాశంగా పోశారు. యాదవ కులస్తులతో పాటు గ్రామస్తులు ప్రసాదం స్వీకరించారు.

అటెన్షన్ ప్లీజ్





సంప్రదించాల్సిన అధికారి : ప్రదీప్‌గౌడ్, ఏఈ పెద్దకొత్తపల్లి
సెల్‌నంబర్ 9440813496

కల్వకోలు బస్టాండ్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చి మొక్కలు

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోలు బస్టాండ్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కల తీగలు అల్లుకోవడంతో చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. గ్రామస్తులు పిచ్చి మొక్కలు, తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యాధుల నివారణకు ప్రత్యేక డ్రైవ్


చెన్నంపల్లిలో దోమల నివారణ మందును పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

లింగాల: మండలంలోని చెన్నంపల్లిలో ఇటీవల సీజనల్ వ్యాధులు ప్రబలడంతో వైద్య శాఖ నివారణ చర్యలు చేపట్టింది. సీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు ఇంటింటికీ తిరిగి దోమల నివారణ మందును పిచికారి చేశారు. దోమల వ్యాప్తికి చెందే ప్రదేశాలలో మందును పిచికారి చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు యాదాబాయి, రేణుకాదేవి, ఆశాకార్యకర్తలు జ్యోతి, ప్రమీల పాల్గొన్నారు.

రహదారులు బురదమయం


వర్షం నీరు నిలిచిన సీతారాంపూర్–పోలిశెట్టిపల్లి రహదారి

బల్మూర్: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ప్రధానంగా మండలంలోని వీరంరాజ్‌పల్లికి వెళ్లే అచ్చంపేట, రామాజిపల్లి, కొండనాగులతో పాటు మండల కేంద్రం నాలుగు దిక్కుల ఉన్న మట్టి రోడ్లు నేటికి బీటీలకు నోచుకోక గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఈ గ్రామానికి వర్షాకాలంలో వెళ్లాలంటే ద్విచక్రవాహన చోదకులు సైతం అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. 2017లో రామాజిపల్లి నుంచి వీరంరాజ్‌పల్లి మీదుగా కొండనాగుల వరకు రూ.6కోట్లతో బీటీరోడ్డు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా.. అది నేటికి కార్యరూపం దాల్చలేదని గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.


వీరంరాజ్‌పల్లి రహదారి ఇలా..

బీటీలకు నోచుకోక నిత్యం అవస్థలు

మండలంలోని తుమ్మెన్‌పేట–జిన్‌కుంట, చెన్నారం – మహాదేవ్‌పూర్, సీతారాంపూర్ – పోలిశెట్టిపల్లి, ఇప్పకుంట, మొత్కులకుంట, కొత్తపల్లి, గోదల్ – నర్సాయపల్లి రహదారులు నేటికీ బీటీలకు నోచుకోలేదు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయ నాయకులు గ్రామాలకు బీటీ రోడ్లు వేయించి ఇబ్బందులు తొలగిస్తామని హామీలు ఇస్తున్నారే తప్పా అవి అమలుకు నోచుకోవడం లేదని మండిపడుతున్నారు. మండలంలోని కొండనాగుల నుంచి తెల్గిరిగూడిలు తోడెళ్లగడ్డ, బల్మూర్ నుంచి చెన్నారం వరకు బీటి రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు అయినా కూడా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆరు నెలలుగా పనులు నత్తనడకన సాగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెళ్లలేని పరిస్థితి..



మా గ్రామానికి నాలుగు దిక్కుల ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మారుస్తామని ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తారు. గెలిచాక పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గ్రామానికి వచ్చే రోడ్లన్నీ బురద గుంతలుగా మారి వెళ్లలేని పరిస్థితితో అధ్వానంగా మారావి.

– కిష్టయ్య, వీరంరాజ్‌పల్లి

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో బీటీ రోడ్లులేని అన్ని గ్రామాలకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు చేయిస్తాం. నిధులు మంజూరైన రోడ్ల పనులను పూర్తి చేయిస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, పంచాయతీరాజ్, బల్మూర్

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


కొల్లాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటో, వీడియోగ్రాఫర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు. తమకు పూచీకత్తు లేకుండా ప్రభుత్వం రుణాలు అందించాలని కోరారు. ఫొటో స్టూడియోలకు ఉచిత్ విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు షబ్బీర్, మహబూబ్, తాజోద్దీన్, శేఖర్, ఖయ్యూం, చందు, మోసిన్, శ్రీనివాసులు, భవాని మూర్తి, ఆసిఫ్, సంతోష్, రహిమొద్దీన్ తదితరులున్నారు.

అచ్చంపేట రూరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి నివాళి అర్పించారు.



అచ్చంపేటలో..

కల్వకుర్తిరూరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం పట్టణంలో చేపట్టారు. బస్టాండ్ నుంచి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు ఫొటో, వీడియోగ్రాఫర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం, అనిల్ గౌడ్, నందు, గోవర్ధన్, వాహెద్, శ్రీను, రమేష్, గౌస్, తన్వీర్, అమీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సింగారంలో సమస్యలు పరిష్కరించాలి


గ్రామంలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జనాభాకు అనుగుణంగా అదనంగా వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, బాలింగయ్య, అంజన్నయ్య, కృష్ణయ్య, దస్తగిరి, అంతయ్య, సుందరయ్య, వెంకటేష్, రాములు పాల్గొన్నారు.

బిక్కుమాండ్ల ముత్యాలుకు నివాళి

వెల్దండ: మండల కేంద్రంలో స్వాతంత్ర్య సమర యోధుడు బిక్కుమాండ్ల ముత్యాలు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రధాన వీధుల గుండా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, వెంకటయ్యగౌడ్, వెంకటయ్య, గిరి, విజేందర్‌రెడ్డి, వజ్రలింగం, సమీర్, శ్రీను, బుచ్చయ్య, నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.